## డిజిట్-మెరిట్



# 72,815
కోట్ల రూపాయలు

11 విడతల్లో రైతన్న ఖాతాల్లో జమ అయిన రైతుబంధు మొత్తం. ఏటా ఎకరానికి రూ.10వేల చొప్పున 68.99 లక్షల మందికి రైతుబంధు అందిస్తున్న ప్రభుత్వం.


## థర్డ్ అంపైర్



సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి జరుగుతున్నది. తెలంగాణ సాధిస్తున్న ప్రగతి, చేపట్టిన సంక్షేమ పథకాలు మహారాష్ట్రలో కూడా అమలు కావాలని కోరుకుంటున్నా. తెలంగాణ మాడల్ దేశవ్యాప్తంగా విస్తరించాలి.

▪ శంభాజీ రాజే, ఛత్రపతి శివాజీ వారసుడు

## థౌజండ్ వాలా..




కౌంట్ డౌన్
**30**

హైదరాబాద్ | మంగళవారం 31 అక్టోబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

I

www.ntnews.com



### శాంతియుతంగా తెలంగాణ సాధన

అహింసామార్గంలో స్వాతంత్ర్యాన్ని సాధించి మహాత్మాగాంధీ ప్రపంచానికి కొత్త పోరాట పంథాను పరిచయం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో గాంధీచేసిన అద్భుత మైన స్వాతంత్ర్య పోరాట వ్యూహరచనను పుణికిపుచ్చుకున్నాం. నా సహచరులు చాలా సందర్భాల్లో నిరాశ, నిస్పృహలకు లోనయినా ఆ పంథా వీడలేదు. అహింసా మార్గంలో నడిచి, శాంతియుతంగానే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నం.

▪ కేసీఆర్

## ఎటమటం!




### వద్దు ప్లీజ్..!

**టికెట్** కావాలని పైరవీలు చేసేవారిని చూశాం కానీ, టికెట్ వద్దని లాబీయింగ్ చేసే వారిని మాత్రం తెలంగాణ బీజేపీలోనే చూస్తున్నాం. టికెట్ ఇచ్చి మా రాజకీయ జీవితం నాశనం చేయొద్దు ప్లీజ్ సీనియర్లు పార్టీ పెద్దలను వేడుకుంటున్నారు. ఇప్పటికే టికెట్లు ప్రకటించిన జాబితాలో ఉన్న నాయకులు సైతం అసెంబ్లీ ఎన్నికల వరకు వదిలేయండి అని ప్రాధేయపడుతున్నారు. గద్వాల టికెట్ తనకు ఇవ్వడం కంటే బీసీలకు ఇస్తే, బాగుంటుందని దొడ్డ మనసును చాటుకున్నారు ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ. 'ఇప్పటికే రెండు సార్లు ఎంపీగా చేశాను, ఇప్పుడు ఎమ్మెల్యేగా రివర్షన్ ఎందుకు? కాదూ కూడదూ అంటే.. షాద్‌నగర్ నుంచి మా అబ్బాయికి ఇవ్వండి' అని మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి అంటున్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేయమని డిమాండ్లున్నా, అసెంబ్లీకి పోటీ చేసే ఆలోచన తనకు లేదని విజయశాంతి ముందే తప్పించుకున్నారు. టికెట్ వద్దని ఇక్కడ కూర్చొని చెబితే పప్పులేమీ ఉడకవు. మమ్మల్ని చూడండి... మా పేర్లు కనీసం పరిశీలనకు కూడా రాకుండా ఎంతగా ముందు జాగ్రత్త పడ్డామో... అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ వెక్కిరిస్తున్నారు. మీరు బాగానే ఉన్నారు... మేము మాత్రమే బలి పశువులం కావాలా? అని బండి సంజయ్, ధర్మపురి అరవింద్, సోయం బాపూరావు గుస్సా మీద ఉన్నారట.



### అచ్చొస్తలేదంట

**రాజన్న** రాజ్యం పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలంగాణ గడ్డపై రాయలసీమ రాజ్యాన్ని స్థాపించేందుకు పాదాల మీద నడిచే పాదయాత్ర చేసినా జనం పట్టించుకోలేదు. మోకాళ్ల మీద దేకుతూ తిరిగినా ఫలితం లేదని అర్థం అయింది. అప్పుడేమో హైదరాబాద్ వెళ్లాలంటే వీసా కావాలా? అని అడిగి, ఇప్పుడేమో నేను నగరంలోనే పుట్టిన, మెహిదీపట్నంలో చదివిన, మ్యారేజ్ ఇక్కడే, సంతానం ఇక్కడే అని షర్మిల చాటింపు వేసినా ఫలితం లేకపాయె. దీంతో తన బిడ్డ నెత్తిన సాడేసాత్ ఏమైనా కూర్చుందా? అని తల్లి విజయమ్మ ఒంగోలు వెళ్లి జ్యోతిషుణ్ని అడిగారట. పార్టీ నడపడం కన్నా కాంగ్రెస్‌లో కలిపితే షర్మిలకు లాభం.. ఆ పార్టీకి నష్టం అని సెలవు ఇచ్చారట ఆయన. ఆ విలీనం కూడా చివర్లో ఆగింది. ఇక ఒంటరిగానే పోటీ చేయబోతున్నారు.. కనీసం బీ ఫారాలకైనా ముహూర్తం పెట్టండని అడిగారట. తిరుగు ప్రయాణంలో విజయమ్మ కారుకు తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో ఏం చేసినా అక్కకు అచ్చొస్తలేదని జై షర్మిలక్క బ్యాచ్ వాపోతున్నది!

▪ వెల్జాల

బీడీలు సుట్టుడు కాల్చినంత తేలిక కాదు.
తునికాకు తేవాలి. నానబెట్టాలి.
నార తీయాలి. ఓ నమూనా రేకుముక్క
సైజు పెట్టి ఆకు కట్ చేసుకోవాలి. చాట్ల
తంబాకు పోసుకొని ఓపికగా కూసోవాలి.
ఒక్కోఆకు తీసి.. అందులో తంబాకేసి..
బీడీ చుట్టి.. దారం కట్టి.. పక్కన పెట్టాలి!
వంద బీడీలు అయ్యేసరికి వెన్ను
విరిగినంత పనైతది. రిన్ సబ్బు తోని
కడుక్కున్నా చేతులకు పట్టిన తంబాకు
వాసన పోదు! తెలంగాణ ఆడబిడ్డల బీడీల
కష్టాలు ఒడవని ముచ్చటే! వారికి సాయం
చేయాలని గతంలో ఏ ప్రభుత్వమూ
ఆలోచించలే. కేసీఆర్ ప్రభుత్వం
బీడీ కార్మికుల బతుకు వెతలు తెలిసి..
గౌరవప్రదమైన భృతి ఇవ్వాలని
నిర్ణయించింది. ఆ పైసలు చేసిన
అద్భుతమేందో... నాగమణక్క
జీవితం చెబుతుంది..



# సార్ ఆసరా.. నా బిడ్డ సదువుకు భరోసా

సామాన్యుల మాట

- బతుకు మార్చిన జీవనభృతి
- పింఛన్ డబ్బులతో బిడ్డల చదువులు
- ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ చేస్తున్న పెద్ద కూతురు
- ఎనిమిదేండ్లుగా అందుతున్న ప్రభుత్వ ఆర్థిక సాయం
- కేసీఆర్ వెంటే మేమంటున్న బీడీ కార్మికురాలు నాగమణి

**ఆమెకు బతకనీకి భూమి లేదు. ఉండనీకి ఇల్లు లేదు. కష్టసుఖాల్లో తోడుండే మొగుడు ఏమై పోయిండో తెల్వదు. చెప్పుకోనీకి సంతోషాలు లేవు. కానీ, ఇద్దరు బిడ్డల సదువు, ఆపై వాళ్ల పెండ్లి భారం. రెక్కాడితే గానీ డొక్కాడని ఈ పేదరాలు పేరు ఆర్మూర్ నాగమణి. బిడ్డల కోసం పొద్దుకో పని జేస్తది. మూడు పూటలు కష్టవడ్డా ఇల్లు గడవని పేదరికం. పనుల మధ్య చిన్న సందు దొరికినా బీడీలు చుడ్తది. బీడీ కార్మికురాలిగా తనకు వచ్చే పింఛిన్ (భృతి) పైసలతోని పెద్దబిడ్డను పీజీ దాకా తీసుకొచ్చింది. 'పెద్ద సదువు సదువుతున్న బిడ్డకు పెన్ను, బుక్కు, బట్టలు, పరీక్ష ఫీజు.. గియన్నిటికీ పింఛిన్ ఆసరా అయితున్నద'ని చెబుతున్నది కోరుట్ల ఆడబిడ్డ నాగమణి. ఈ బీడీ కార్మికురాలి కథ ఆమె మాటల్లోనే చదవండి.**

**మాకు** ఇల్లు లేదు. భూమి లేదు. రెక్కలు ముక్కలు జేసుకునే బతకాలి. బతుకుదెరువు కోసమని మా అమ్మనాన్న అండ ఉందని కోరుట్ల (జగిత్యాల జిల్లా) వచ్చినం. ఇద్దరం కైకిలికి పోయి బతికినం. మాకు ఇద్దరు ఆడపిల్లలు. ఏదో బతుకు జరుగుతాంది అనుకున్నంతల నా పెనిమిటి ఇల్లు ఇడ్సిపెట్టి జాడలేకుండా పోయిండు. ఆయన గురించి తిరగని తావు లేదు. బాగనే ఎతికించినా పాయిదా కనిపించలే! ఎక్కడున్నడో, ఏమైపోయిండో తెల్వదు. నా నసీబు గింతే అనుకున్న. ఇద్దరు బిడ్డల భారమంతా నామీద వడ్డది. మా అమ్మ, నాయిన చేరదీశింద్రు. వాళ్లతోనే ఉండమన్నరు. తమ్ముల్లు గిన అండగ ఉండేది.

### రోజుల మూడు పనులు

ఎంతకాలమని వాళ్లమీద ఆధారపడతం. తమ్ముల్లు పెద్దోల్లయిన్రు. వాళ్లకు పెండ్లిలయినయ్. ఇగ ఆ ఇరుకింట్ల తిప్పలైతదని మా ఊళ్లనే కిరాయింట్లకు మారిన. పొద్దంత పొలం కైకిలి చేస్తుంటా. పొద్దుమీకి బీడీలు చుడుత. ఇండ్లల్ల పని కూడ చేస్త. గీ పైసలు చాలవని ఫంక్షన్ హాల్లల్ల బోల్లు తోమనీకి పోతుంట. రాత్రి పదకొండయ్యే వరకు పని చేస్తనే ఉంట. ఆ రాత్రి ఇంటికొచ్చినాంక బీడీలు చుట్టక తప్పదు. పిల్లలు పెరిగే కొద్దీ ఖర్సులు ఎక్కువైతయ్ కదా! ఆడపిల్లలకు మస్తు అవసరాలుంటయి. ఉన్నదాంట్ల వాల్లకు కష్టం లేకుండ చూసుకోవాలి గదా! వాల్లకు అమ్మ తప్ప నాన్న లేడాయె! దేనికైనా ఎవలనడుగుతరు పాపం! నేను బాధ పడుతుంటి కానీ, నా పిల్లలు బాధపడొద్దని సాదుకొచ్చిన. పనులు చేస్కుంట మంచిగ సదివించిన. వాళ్లు ఎంత అంటె అంత సదివిపిస్తా! నా బిడ్డలు సక్కగ సదువుతరు. నా పెద్దబిడ్డ తెలివిగల్ల పిల్ల. ఉస్మానియా అంట పెద్ద కాలేజీల డిగ్రీ తర్వాత ఏదో పెద్ద సదువుంటదట (పీజీ) కదా! అది సదువుతాంది. దానికింత మంచి పని దొరుకుతదని ఆశ. పిల్లల కోసం పొద్దున లేచింది మొదలు పనులు చేస్తనే ఉంట. ఇంటికొచ్చి ఇంత తింట.

### కష్టమైనా ఇష్టమైన పనే..

బీడీలు సుడితే ఎంతొస్తయి! అయినా తప్పదు. పనులు రోజు ఉండవాయే! నాలుగు రోజులు పనులు దొరక్కపోతే.. పైసలెట్ల. అందుకే బీడీలు సుట్టుడు మొదలుపెట్టిన. కేసీఆర్ సారు సర్కార్ అచ్చినాంక నా బాధలన్నీ మాయమైనయ్. బీడీలు సుట్టేటోళ్లకు రెండువేల సాయం జేస్తనని చెప్పిండు. నెలనెలా ఇస్తాండు. ఎనిమిదేండ్ల సంది నెలకు రెండువేలు పింఛిన్ అస్తున్నది. నెలంత పదివేల బీడీలు సుడితె గానీ రెండువేలు రావు. గసొంటిది మా కష్టం తెలుసుకొని, అడగకుండనే నెలకు రెండువేలు సారు సాయం చేస్తున్నడు. బీడీలు సుడితెనే పింఛిన్ అస్తది. అందుకే, దినాం ఎన్ని పనులున్నా, ఎంత పొద్దుగూకినా బీడీలు సుడతా! ఇప్పుడు పానం అప్పటంత హుషారుగ ఉంటలేదు. అయినా, పింఛిన్ కోసం కష్టపడుతున్న. ఆ పైసలతోనే నా బిడ్డల సదువు సాగుతున్నది. బీడీలు సుడితే కొంత వస్తున్నది. కేసీఆర్ సార్ ఇచ్చే పైసలతో నా బిడ్డలను సదివిస్తున్న. సార్ సాయం జీవితంలో యాది మరువ.

నాగవర్ధన్ రాయల | గడసంతల శ్రీనివాస్

### ▪ సారే గెలవాలె

**సార్** ఇచ్చే రెండు వేలతోనే నా బిడ్డను సక్కగ సదివిస్తున్న. ఫీజులు, పుస్తకాలు, పెన్నులకు సాయమైతంది. పిల్లల పెండ్లికి సాయమైతదని పింఛిన్ డబ్బులల్ల అయిదు వందలు నెలనెలా పోస్టాపీస్‌ల కడుతున్న. హైదరాబాద్‌ల సదివే బిడ్డ అప్పుడప్పుడు ఫోన్ చేస్తది. అమ్మ పైసలు కావాలంటది. పిల్లల్ని బాధపెట్టకూడదని తప్పకుండ పంపిస్త. ఎప్పుడెప్పుడు ఫీజులు ఖర్చులకు కావాల్నంటె పంపిస్త. పింఛిన్ అచ్చుట్లనే మా కుటుంబానికి ఆసరైతుంది. సారు మా కుటుంబానికి తోడున్నడు. ఆయనకి మేం అండగుంటం. మల్లా సారే గెలవాలె.



# దాదాగిరి Vs డెవలప్‌మెంట్

**మల్కాజిగిరిలో మీ ప్రభావం ఎంత వరకు ఉంటుంది?**
ఈ నియోజకవర్గానికి ఏం చేయాలో నాకు ఐడియా ఉంది. ప్రజల్లో గుర్తింపు ఉంది. ప్రభావం ఎంత అనే విషయం డిసెంబర్ మూడో తారీఖు మీరే చూస్తారు.

**మీ ప్రత్యర్థి మైనంపల్లితో పోలిస్తే.. మీకు రాజకీయ అనుభవం తక్కువ. ఎలాంటి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు?**
ఉండాల్సింది.. రాజకీయ పరిజ్ఞానం. ప్రజలకు సేవ చేయాలనే తపన. ఈ రెండూ ఉంటే ప్రజలు గెలిపిస్తారు. ఆ తర్వాత అనుభవం అదే వస్తుంది. పదేండ్లలో కేసీఆర్ గారు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి చెప్పడమే నా వ్యూహం.

**మొన్నటి వరకు మీ పార్టీలోనే ఉండి.. రెండు టికెట్లు ఇవ్వలేదని పార్టీ మారిన మైనంపల్లి హన్మంతరావు మీద మీ కామెంట్?**
కొడుక్కి మెదక్ టికెట్ ఇవ్వలేదని పార్టీ మారిన స్వార్థం ఆయనది. కబ్జాలు, గుండాయిజం తప్ప ప్రజాసేవ పట్టని అలాంటి సెల్ఫిష్ లీడర్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు.

**ప్రచారం జోరుగా చేస్తున్నారు. స్పందన ఎలా ఉన్నది?**
ప్రజలకు ఒక క్లారిటీ ఉందండీ. కేసీఆర్ మళ్లీ గెలిస్తేనే మన జీవితాలు మరింత బాగుపడతాయని నమ్ముతున్నరు. ఎవరూ చేయని అభివృద్ధి చేసి చూపిన విజన్ ఉన్న లీడర్ ఆయన. చెప్పినవి మాత్రమే కాదు.. చెప్పనివీ ఎన్నో చేశారు.

ఫటాఫట్



Interview

**కాంగ్రెస్, బీజేపీలు ఇంకా ప్రచారమే మొదలు పెట్టలేదు. మీరేమో స్పీడ్‌గా దూసుకెళ్తున్నారు...**
ప్రతిపక్షాల అభ్యర్థులు ఎవరో తేలాలంటే ఇంకా చాలా టైమ్ పట్టేలా ఉంది. వాళ్లు సీట్లు పంచుకునే లోపు.. మేము స్వీట్లు పంచుకుంటం.

**మైనంపల్లి పార్టీ మారడం వల్ల మీ పార్టీకి నష్టమా..?**
మైనంపల్లితో ఒక్కరు కూడా మా పార్టీ కార్యకర్తలు వెళ్లలేదు. పైగా కాంగ్రెస్ నుంచే మా పార్టీలోకి నాయకులు, కార్యకర్తలు వచ్చారు. అది చాలదా.. మైనంపల్లి వల్ల మాకు ఎలాంటి ఎఫెక్ట్ లేదని చెప్పడానికి.

**నియోజకవర్గ ప్రజలకు ఏం చెప్తున్నారు?**
అధికార పార్టీలో గెలిచినప్పటికీ మైనంపల్లి ఒక్కనాడు కూడా ఈ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆలోచించలేదు. కబ్జాలు, కేసులు తప్ప వేరే ఆలోచన లేదు ఆయనకు. నన్ను గెలిపిస్తే ప్రజలకు ఏం చేస్తానో చెప్తూ ప్రచారం చేస్తున్నా. ప్రజలు సైతం స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.

▪ సుంకరి

## ఖుల్లం ఖుల్లా

ఓటుకు నోటే కాదు సీటుకు నోటట బేరం
రాజకీయ విపణిలోన ఎంత వింత నాటకం
ఎన్నికల సమరంలోన చూడు 'హస్త'లాఘవం
ఘోర చోర కళలోన నేర్పరులీ కురు సైన్యం

కొట్లాటలు కుమ్ముకోళ్లు కొత్త వీధి నాటకం
రచ్చ రచ్చ బాగోతం రాజీనామాల పర్వం
అసమ్మతి అసంతృప్తి అస్మదీయ బూటకం
అడ్డగోలు వ్యవహారం 'చే'జారిన సొంత జనం

... దండమూడి శ్రీచరణ్